
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

ఆదివారం 19 జనవరి 2025

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

ఫేస్‌టుఫేస్

- జర్నలిస్టుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు
- మార్గదర్శకాలు రాగానే అక్రిడిటేషన్ కార్డులు
- జిల్లా పౌరసంబంధాల, సమాచార శాఖ అధికారి వంగరి శ్రీధర్



జిల్లాలో ప్రభుత్వం ప్రవేశ పెడు తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నా మని జిల్లా పౌర సంబంధాల, సమాచార శాఖ అధికారి వంగరి శ్రీధర్ తెలిపారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాగానే అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు.

ఆంధ్రజ్యోతి: సంక్షేమ కార్యక్రమాల ప్రచారం ఎలా చేపడుతున్నారు?

డీపీఆర్వో: జిల్లాలో 12 మంది సారథి కళాకారులు ఉన్నారు. రెండు బృందాలుగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ప్రతి నెలా 25 రోజుల పాటు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. గ్రామాలకు వెళ్లి ప్రభు త్వ సంక్షేమ పథకాలతోపాటు పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, అంటు వ్యాధులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: సారధి కళాకా రులకు వేతనాలు అందుతున్నా యా?

డీపీఆర్వో: సారధి కళాకారులకు వేతనాలు సక్రమంగా అందుతున్నాయి. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం సారధి కళాకారుల వేతనాలను 30 శాతం పెంచింది.

ఆంధ్రజ్యోతి: జర్నలిస్టులకు అక్రిడి టేషన్ కార్డులు ఎప్పుడు జారీ చేస్తారు?

డీపీఆర్వో: త్వరలోనే అక్రిడి టేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియ మొదలు కానుంది. ప్రభుత్వానికి నివేదికలు అందించాం. మార్గదర్శకా లు సిద్ధం అవుతున్నాయి. ముఖ్య మంత్రి వద్ద పరిశీలనలో ఉంది. జీవో రావడంతోనే అక్రిడిటేషన్లు అర్హులైన జర్నలిస్టులకు జారీ చేస్తాం.

ఆంధ్రజ్యోతి: జర్నలిస్టు సంక్షే మానికి చేపడుతున్న కార్యక్రమాలు ఏమిటి?

డీపీఆర్వో: జర్నలిస్టుల సంక్షేమ పథకాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది వివిధ కారణాలతో మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలకు పింఛన్, వారి పిల్లల చదువులకు ఆర్థిక సాయం అందజేస్తున్నాం. గతంలో కొవిడ్ సమయంలో బాధి తులకు ఆర్థికసాయం అందించాం. - ఆంధ్రజ్యోతి సిరిసిల్ల

'రేషన్' జాబితాపై అయోమయం

- అర్హుల పేర్లు లేకపోవడంతో ఆందోళన
- పదేళ్లుగా ఎదురు చూపులు
- జిల్లాలో 40 వేలకు పైగా దరఖాస్తులు
- 9731 కుటుంబాలు మాత్రమే గుర్తింపు
- కొనసాగుతున్న అర్హుల గుర్తింపు సర్వే
- 26 నుంచి జారీకి సన్నాహాలు



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

కొత్త రేషన్ కార్డుల సర్వే జాబితాపై దరఖాస్తు దారుల్లో అయోమయం నెలకొంది. కార్డులు లేక అనేక మంది అర్హులు సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు. ఈ సారైనా కార్డులు వస్తాయని ఆశతో ఉన్నారు. జాబితాలో అందరి పేర్లు లేకపోవడంతో మరోసారి నిరాశే ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నెల 26 నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. సర్వే చేస్తున్న జాబితా ప్రకారం చూస్తే జిల్లాలో అర్హులందరికీ కార్డులు వస్తాయా? లేదా కొందరికే కార్డులు ఇచ్చిన అనంతరం మళ్లీ వాయిదా పడుతుందో? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీతోపాటు మార్పులు, చేర్పులకు అవకాశం ఇచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాది డిసెంబరు 26 నుంచి జనవరి 8 వరకు ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించగా రేషన్ కార్డులు లేని వారు దరఖాస్తులు చేసు కున్నారు. ఆ సమయంలో జిల్లాలో ఆరు గ్యారంటీలకు 1.92 లక్షల దరఖాస్తులు రాగా 40 వేల మంది రేషన్ కార్డులు, మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకున్నారు.

అందరికి కార్డులు వస్తాయని ఎదురు చూస్తున్న క్రమంలో ప్రస్తుత సర్వేలో దరఖాస్తుల్లో 25 శాతం మంది పేర్లు మాత్రమే వచ్చాయి. జిల్లాలో సర్వే కు వెళ్లిన అధికారులను తమ పేర్లు ఏవని అర్హులు ప్రశ్నిస్తున్నారు. అనర్హుల పేర్లు వచ్చాయని, అర్హులైన పేర్లు తొలగిపోయాయని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ గందరగోళ పరిస్థితుల్లో కార్డులు అందరికీ అందకపోవచ్చనే భావన ఏర్పడుతోంది.

రేషన్ కార్డులపై ఆశలు

అర్హత ఉన్నా కొత్త రేషన్ కార్డుల కోసం దశాబ్ద కాలంగా అనేక మంది ఎదురు చూస్తున్నారు. ఆరు గ్యారంటీల సందర్భంగా జిల్లాలో 40 వేల మది రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. సామాజిక ఆర్థిక సర్వేలో జిల్లాలో 9 వేల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు లేవని గుర్తించారు. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు రేషన్ కార్డుల జారీ ప్రక్రియను పర్యవేక్షిస్తారు.

జిల్లాలో ప్రభుత్వం గుర్తించిన కుటుంబాలు

మండలం	కుటుంబాలు
బోయినపల్లి	553
చందుర్తి	655
ఇల్లంతకుంట	903
గంభీరావుపేట	717
కోనరావుపేట	836
ముస్తాబాద్	903
రుద్రంగి	314
సిరిసిల్ల	1420
తంగళ్లపల్లి	710
వీర్నపల్లి	217
వేములవాడ అర్బన్	819
వేములవాడ	421
వేములవాడ రూరల్	496
ఎల్లారెడ్డిపేట	767
మొత్తం	9731

జిల్లాలో 9,731 కుటుంబాల గుర్తింపు

జిల్లాలో గతేడాది నవంబరు, డిసెంబరులో కుల గణన సర్వేలో రేషన్ కార్డులు లేని కుటుంబాలను సైతం గుర్తించారు. ఇందులో జిల్లాలో 9731 కుటుంబాలు ఉన్నట్లు జాబితా సిద్ధం చేశారు. ఈ జాబితా ఆధారంగా సర్వే చేస్తున్నారు. సర్వే అనంతరం ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి అర్హుల జాబితాను పూర్తి చేయనున్నారు. గ్రామ సభలు, సర్వే అధికారులకు సైతం సవాలుగానే మారుతున్నాయి. ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో నని ప్రజల నుంచి ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

చేర్పులు, మార్పులు పూర్తయ్యేనా?

జిల్లాలో ప్రస్తుతం లక్షా 73 వేల 728 రేషన్ కార్డులు ఉన్నాయి. లబ్ధిదారులు 4,97,000 మంది ఉన్నారు. ఇందులో ఆహార భద్రత కార్డులు 1,59,760, అంత్యోదయ కార్డులు 13,761, అన్నపూర్ణ కార్డులు 207 ఉన్నాయి. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో కొత్త కార్డులు రాకపోగా కనీసం ఉన్న కార్డుల్లో చేర్పులు, మార్పులు చేపట్టలేదు. మిగతా 8వ పేజీలో..

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

7,8లో..

కందుల కొనుగోలుకు చర్యలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

- క్వింటాల్‌కు రూ.7550 మద్దతు ధర
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

8

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్మీడియెట్ విద్యాధికారి శ్రీనివాస్

ఇల్లంతకుంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో శనివారం సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు విద్యార్థి దశలో ఇంటర్‌మీడియట్ కీలకమైనదన్నారు. సమయాన్ని వృధా చేసుకోకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉత్తమ విద్యార్థులకు సమాజంలో మంచి గౌరవం దక్కుతుందన్నారు. పరీక్ష ఫీజు చెల్లించిన వారందరు తప్పనిసరిగా కళాశాలకు హాజరు అయ్యేలా చూడాలని అధ్యాపకులకు సూచించారు. కళాశాలలో 90రోజుల ప్రణాళికను అమలు చేయాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాస దేవరాజంతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన అవసరం



విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఎంవీఐ వంశీధర్

ఎల్లారెడ్డిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంచుకోవాలని గ్రామాల్లోని ప్రజలను చైతన్య పర్చాలని ఎంవీఐ వంశీధర్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి వేగం, నిర్లక్ష్యం ప్రమాదాలకు కారణమవుతోందన్నారు. మత్తులో వాహనాలను నడిపడంతో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంవీఐ పృథ్వీ రాజ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఉత్సవాల సన్నాహక సమావేశం

ఇల్లంతకుంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం అయ్యప్పస్వామి ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. మండలకేంద్రంలో ఫిబ్రవరి 3 నుంచి అయ్యప్పస్వామి దేవాలయ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో అయ్యప్పదీక్షపరులు ఎర్రోజు గోపాలచారి, బిల్ల రఘు, ఈదుల రవీందర్‌రెడ్డి, చారి, ఎల్లారెడ్డి, కొట్టె వెంకటి, మోహన్ రెడ్డి, ఆంజనేయులు, శంకర్, నర్సయ్య, మామిడి రాజు, రాంకిషన్, రాము, శ్రావణ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఇల్లంతకుంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దలింగాపూర్‌లో సీసీ రోడ్డు పనులను మాజీ ఎంపీటీసీ కరివెద స్వప్నకర్ణాకర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. సీసీ రోడ్డు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని గుర్తించిన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ రూ.5లక్షలు కేటాయించారు. నాయకులు ల్యాగల సంపత్, మాతిరెడ్డి రవీందర్‌రెడ్డి, గన్నారం లచ్చయ్య పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : దరఖాస్తు చేసుకున్న ప్రతీ అర్హుడికి సంక్షేమ పథకాలు అందజేస్తామని, ఇప్పుడు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సమాచార పౌర సరఫరాల శాఖ, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ, జౌళి, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్ నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలపై సీఎస్ శాంతి కుమారితో కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని, నిరంతర ప్రక్రియ అని అన్నారు. కొత్త రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కుల, సామాజిక, ఆర్థిక సర్వే, పాత రేషన్ కార్డుల ఆధారంగా పేర్లు నమోదు చేసినట్లు చెప్పారు. వీటిల్లో ఎవరైనా పేర్లు రాని వారుంటే ఈ నెల 21వ తేదీ నుంచి జరిగే గ్రామ సభలలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి అఫ్జల్ బేగం, పౌర సరఫరాల శాఖ అధికారి వసంత లక్ష్మీ, హౌసింగ్ పీడీ చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహనకు 'ఖాకీ కిడ్స్'

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఖాకీ కిడ్స్ కార్యక్రమం ప్రారంభం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సైబర్ నేరాలపై అప్రమత్తతో పాటు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఖాకీకిడ్స్ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్ మహాజన్, జిల్లా లైబ్రరీ చైర్మన్ నాగుల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సంద ర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తతో పాటు ట్రాఫిక్ నియమాకాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులను సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దాడమే ఖాకీ కిడ్స్ లక్ష్యమన్నారు. ఎక్కడైతే శాంతి భద్రతలు అదుపులో ఉంటాయో అక్కడే అభివృద్ధి సాధ్యమని, పోలీసు శాఖ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. జిల్లా పోలీసులు ప్రజలకు చేరువగా యువతకు క్రీడా పోటీలు, ఆరోగ్య శిబిరాలు, డ్రైవింగ్ లైసెన్స్, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం సమాజంలో సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసాగిస్తున్నారని, ఆ మోసాల బారిన ప్రజలు పడకూడదనే ఉద్దేశంతో ప్రతీ పోలీస్ స్టేషన్లలో సైబర్ వారియర్‌ల ఎంపిక మంచిపరిణామం అన్నారు. జిల్లాలోని అన్ని కళాశాలల్లో, పాఠశాలల్లో విద్యార్థులకు ఇంటర్నెట్ దుర్వినియోగం, ఆన్‌లైన్ మోసాలు, సైబర్ మోసాల బారిన పడకుండా

మిగతా 8వ పేజీలో..

వాహనాల వేలం ద్వారా రూ.5.36 లక్షల ఆదాయం



వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : వాహనాల వేలం పాటల్లో రూ.5.36 లక్షలు వచ్చాయని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో జిల్లాలో పలు సందర్భాల్లో స్వాధీన పరుచుకున్న, రోడ్ల మీద వదిలేసిన 54 వాహనాలు వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో సర్వీస్‌లో లేని కిట్ ఆర్టికల్స్, పాత టెంట్లు, ఇనుప సామగ్రి, జనరేటర్, స్టోర్ తదితర వస్తువులకు వేలం నిర్వహించినట్లు, రూ.1.54 లక్షలు వచ్చినట్లు, ప్రభుత్వ ఖాతాలో జమ చేశామన్నారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మురళి కృష్ణ, ఆర్.ఐలు మధుకర్, రమేష్ పాల్గొన్నారు.

వ్యవసాయ యోగ్యంకాని భూములను తొలగించాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

వేములవాడ రూరల్/చందుర్తి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసాకు సంబంధించిన జాబితా నుంచి వ్యవసాయ యోగ్యంకాని భూములను తొలగించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వేములవాడ రూరల్ మండలం నాగయ్యపల్లి, చందుర్తి మండలం జోగాపూర్‌లో రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు, నూతన రేషన్ కార్డుల జారీకి కొనసాగుతున్న సర్వేను శనివారం తనిఖీ చేశారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సర్వే పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. జిల్లా పశు వైద్యాధికారి, మండల ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి, డిస్ట్రిక్ ఆడిట్ ఆఫీసర్ శ్రీనివాస్, తహసీల్దార్లు సుజాత, శ్రీనివాస్, విజయ్ ప్రకాష్ రావు ఉన్నారు.

కోనరావుపేట : కోనరావుపేట మండలం ధర్మారంలో చేట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల సర్వేను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలకోసం అర్హులను గుర్తించాలని, వారికి పథకాలు అందించే విధంగా సర్వే నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట కోనరావుపేట తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు, ఏవో సందీప్, కార్యదర్శి శ్రీకాంత్ ఉన్నారు.

ముగిసిన 'నవోదయ' ప్రవేశపరీక్ష

చొప్పదండి, జనవరి 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 కేంద్రాలలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 6,806 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 5,064 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 1,742 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 74.4శాతం మాత్రమే పరీక్ష రాశారు. పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ మంగతాయారు తెలిపారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్‌యూ పీజీ పరీక్షల ఫీజు షెడ్యూల్ విడుదల

గణేశ్‌నగర్, జనవరి18 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీ ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల రుసుమును జనవరి 29లోపు చెల్లించాలని యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీరంగప్రసద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2016-2017 సంవత్సరం కోర్సుల్లో చేరిన వారికి ప్రత్యేక రుసుముతో ఒకసారి అవకాశం కల్పించినట్టుగా తెలిపారు. మరిన్ని వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షలు నియంత్రణ అధికారి సూచించారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మేడిపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): రంగాపూర్ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.13,820 స్వాధీనం చేసుకున్నారు. సమాచారం మేరకు దాడి చేసి ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కరీంనగర్ రూరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుబ్బపల్లిలో శనివారం సివిల్ సప్లయిస్ అధికారులు దాడి చేసి మూడు క్వింటాళ్ళ రేషన్‌బియ్యం పట్టుకున్నారు. స్థానికుల ఫిర్యాదు మేర కు సాగర్ అనే వ్యక్తి ఇంట్లో డిప్యూటీ తహసీల్దార్ సురేందర్, ఇన్‌స్పెక్టర్ మధు తనిఖీ చేశారు. ఇంట్లో నిల్వ ఉంచిన మూడు క్వింటాళ్ళ రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకుని సాగర్‌పై కేసు నమోదు చేశారు.

గ్రామ స్థాయి నుంచి.. జాతీయ స్థాయికి..



భారత మహిళల ఖోఖో జట్టుతో నరేశ్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): నిరంతర సాధన, కఠోర శ్రమతో భారతదేశ ఖో..ఖో.. జట్టుకు కోచ్‌గా శిక్షణను అందిస్తూ అందరి మన్ననలను అందుకుంటున్నాడు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇస్లావత్ నరేష్. గతంలో క్రీడాకారుడిగా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాడు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బంజరుపల్లి తండాకు చెందిన ఇస్లావత్ నరేష్ ఖో ఖో క్రీడా కారుడిగా అంచెలంచెలుగా ఎదిగి భారత మహిళల ఖో ఖో జట్టుకు శిక్షకుడిగా ఎంపికయ్యాడు. ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరుగుతున్న మొదటి ప్రపంచ కప్ ఖో ఖో పోటీల్లో భారత మహిళల జట్టుకు కోచ్‌గా సేవలందిస్తున్నాడు. నరేష్ హుస్నాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశాడు. అతడి ప్రతిభను గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు కె సదానందం ఖో ఖోలో శిక్షణ అందించాడు.

● జాతీయ స్థాయిలో పతకాలు



సబ్ జూనియర్, జూనియర్ విభాగాల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ ఖో ఖో క్రీడా అకాడమీ కోచ్‌లు అతడికి అకాడమీలో ప్రవేశం కల్పించారు. 2000-2002 సంవత్సరం వరకు నరేష్ అకాడమీలో శిక్షణ పొందుతూ ఇంటర్ విద్యను పూర్తి చేశాడు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి 2002లో హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో నరేష్ పాల్గొన్నాడు. 2004లో తెలంగాణ రాష్ట్ర సీనియర్స్ ఖో ఖో జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి పంజాబ్ రాష్ట్రంలో జరిగిన జాతీయ పోటీల్లో రాష్ట్ర జట్టుకు కాంస్య పతకం సాధించి పెట్టాడు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో 30 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడం విశేషం.

● భారత మహిళా ఖోఖో జట్టు కోచ్‌గా రాణిస్తున్న నరేశ్

● స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో ఉద్యోగం

ఖో ఖో క్రీడాకారుడిగా ప్రతిభ చాటుతూ 2004లో స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో ఉద్యోగం సాధించాడు. 2009లో ఉత్తరప్రదేశ్‌లో జరిగిన జాతీయ ఖో ఖో పోటీల్లో సీనియర్స్ రైల్వే జట్టులో పాల్గొని బంగారు పతకం సాధించడంలో ముఖ్య పాత్ర పోషించాడు. 2015లో బెంగళూరు ఎన్ఐఎస్ సెంటర్‌లో కోచ్‌గా శిక్షణ పూర్తి చేసి 2016లో సౌత్ సెంట్రల్ రైల్వే జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా విధులు నిర్వహించాడు. 2018 నుంచి ఇప్పటి వరకు తెలంగాణ సీనియర్స్ రాష్ట్ర జట్టుకు కోచ్‌గా వ్యవహరి స్తున్నాడు. 2024 రైల్వే సౌత్ సెంట్రల్ జట్టుకు, భారత రైల్వే జట్టుకు కోచ్‌గా వ్యవహరించాడు.



ఇస్లావత్ నరేశ్

● ప్రపంచ కప్‌లో..

2024 మహారాష్ట్రలోని పూణేలో జరిగిన అల్టిమేట్ ఖో ఖో పోటీల్లో చెన్నై క్విక్ గన్స్ జట్టుకు నరేష్ కోచ్‌గా వ్యవహరించి పలువురి మన్ననలను అందుకున్నాడు. అనంతరం ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నరేష్‌ను ప్రపంచకప్‌లో పాల్గొనే భారత మహిళల జట్టుకు కోచ్‌గా నియమించింది. దీంతో నరేష్ 30 రోజుల పాటు ఢిల్లీలో ఉండి భారత మహిళా జట్టుకు శిక్షణను అందించాడు. ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకు ఢిల్లీలో జరుగుతున్న ప్రపంచ కప్ ఖో ఖో పోటీల్లో నరేష్ తన సేవలను అందిస్తూ అందరి ప్రశంసలను అందుకుంటున్నాడు.

కొండగట్టు ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌రావు

మల్యాల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవోగా టి.శ్రీకాంత్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఈవో రామకృష్ణరావు హైదరాబాద్‌లో నిగణేష్ టెంపుల్‌కు బదిలీ కాగ ఆయన స్థానంలో వేములవాడ ఈవో వినోద్ ఇన్నాళ్లు ఇన్‌చార్జీగా విధులు నిర్వహించారు. వరంగల్‌లో విధులు నిర్వహిస్తున్న ఎండో మెంట్ డిప్యూటి కమిషనర్ టి.శ్రీకాంత్‌రావును ఈ నెల 7న కొండగట్టు ఈవోగా నియమించడంతో శనివారం విధుల్లో చేరారు. అంతకు ముందు నూతన ఈవో స్వామి వారి సన్నిధిలో పూజలు నిర్వహించి దేవస్థానం పరిసరాలు పరిశీలించారు. కొండపై అధికారులతో కలసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆక్రమణకు గురవుతున్న భూముల వివరాలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు చంద్రశేఖర్, సునీల్, హరిహరనాథ్ పాల్గొన్నారు



బాధ్యతలు స్వీకరిస్తున్న ఈవో శ్రీకాంత్‌రావు



ధర్మపురిలో మాట్లాడుతున్న ఏపూరి సోమన్న

ఎస్సీ వర్గీకరణ పోరాటానికి కదిలి రావాలి

ధర్మపురి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ కోసం పోరాటం చేసేందుకు ప్రతీ ఒక్కరు కదిలి రావాలని ప్రముఖ కళాకారుడు, ప్రజా యుద్ధ నౌక ఏపూరి సోమన్న పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే వేయి గొంతుకలు, లక్ష డప్పులు మాదిగల మహా ప్రదర్శన కోసం ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సోమన్న మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణ కోసం మాదిగలు నిర్వహించే పోరాటానికి ప్రతీ ఒక్కరు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ నిర్వహించే పోరాటానికి అడ్డుపడే స్వార్థపరుల కుట్రలను మాదిగ జాతి తిప్పికొట్టాలన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలుగా చేస్తున్న వర్గీకరణ పోరాటానికి మద్దతు ప్రకటించి ముందుండాలన్నారు. అంతకు ముందు ఆయన అంబేద్కర్ విగ్రహానికి, చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో వేయి గొంతుకలు, లక్ష డప్పులు రాష్ట్ర కో ఆర్డినేటర్ ఒల్లాల వాణి, జిల్లా కో ఆర్డినేటర్ ప్రముఖ కళాకారులు రామంచ భరత్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు సురుగు శ్రీనివాస్, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి చిర్ర లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సతీష్, రాష్ట్ర నాయకులు రాజమల్లయ్య, లక్ష్మణ్, అమూల్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



చంద్రారెడ్డి(ఫైల్)

తిమ్మాపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై బైకుపై వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామానికి చెందిన గోలి చంద్రారెడ్డి(59) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై తన పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో కొత్తపల్లి స్టేజీ వద్ద ఉదయం హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వెళుతున్న (ఏపీ09సీడబ్ల్యూ0014) కారు వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. చంద్రారెడ్డి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. చంద్రారెడ్డి భార్య గోలి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ..

జగిత్యాల క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ మహిళ శుక్రవారం రాత్రి మృతి చెందింది. పట్టణంలోని బేడబుడుగ జంగాల కాలనీకి చెందిన తుర్పాటి తిరుపతమ్మ(40) అనే మహిళ ప్రధాన రహదారి దాటు తుండగా కరీంనగర్ నుంచి జగిత్యాల వైపు వస్తున్న ఆర్టీసీ బస్సును డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ ఢీ కొట్టాడు. దీం తో తిరుపతమ్మకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే తిరుపతమ్మ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తిరుపతమ్మ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సుల్తానాబాద్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని రాజీవ్ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కరీంనగర్‌కు చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై పెద్దపల్లి నుంచి కరీంనగర్ వెళ్తున్నాడు. అదే సమయంలో సుల్తానాబాద్ శ్రీరాంనగర్‌కు చెందిన అబ్దుల్ కరీం అనే వ్యక్తి సైకిల్‌పై వస్తుండగా ద్విచక్రవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కిందపడి గాయపడ్డారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడంలేదని మనస్తాపానికి గురై మండలానికి చెందిన ఓ యువకుడు శనివారం ఉదయం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్గటూర్ ఎస్ఐ ఉమాసాగర్ వివరాల ప్రకారం.. ఎండపల్లికి చెందిన మానుపాటి రమేశ్ (38)కు 20 ఏళ్ల క్రితం చొప్పదండి మండలం వెదురుకట్ట గ్రామానికి చెందిన పద్మతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్నేళ్లుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. 2017లో పద్మ తన భర్త రమేశ్‌పై వరకట్నం కేసు కూడా పెట్టింది. రమేష్ కొన్ని రోజులు భార్యతో వెదురుకట్టలో కలిసి ఉన్నాడు. తమ సొంత గ్రామమైన ఎండపల్లికి వెళ్లి ఉందామని భార్యను అడగగా ఆమె అంగీకరించలేదు. దీంతో రమేశ్ ఒక్కడే సొంత గ్రామానికి వెళ్లి ఉంటున్నాడు. నాలుగు నెలలుగా రమేశ్ మానసిక పరిస్థితి సరిగ్గా ఉండడం లేదు. భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపానికి గురై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి లచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని యువతి..

కోనరావుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం గోవిందరావుపేట తండాకు చెందిన యువతి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గోవిందరావుపేట తండాకు చెందిన బానోతు గంగోత్రి (23) ఫిట్స్, మతిస్థిమితం లేక బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూపించిన నయం కాలేదు. పది రోజులుగా విపరీతమైన తలనొప్పితో బాధపడుతోంది. ఆరోగ్యం బాగా లేకపోవడంతో జీవితం మీద విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో శనివారం దూలానికి ఉరేసుకుంది. గంగోత్రి తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

బీరు బాటిల్‌లో రబ్బర్ ముక్క

జగిత్యాలరూరల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ మండలంలోని ధరూర్‌లో గల ఓ వైన్స్ దుకాణంలో శనివారం మధ్యాహ్నం ఓ బీర్ బాటిల్‌లో రబ్బరు ముక్క గమనించిన కొనుగోలుదారుడు వైన్స్ యజమానులను ప్రశ్నించాడు. పలువురు యవకులు ఓ వైన్స్‌లో ఆర్‌సీ బీర్లను కొనుగోలు చేసి చూడగా బీర్‌లో రబ్బర్ ముక్క రావడంతో అవాక్కయ్యారు. వెంటనే కొనుగోలుదారుడు వైన్స్‌కి వచ్చి నిర్వాహకులను ప్రశ్నించాడు. దీంతో వైన్స్ నిర్వాహకుడు పొంతనలేని సమాధానాలు చెప్పడమేకాకుండా బాధ్యతారహితంగా వ్యవహరించారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు విచారణ జరిపి సదరు వైన్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరాడు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో జట్టు సత్తా చాటాలి

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర జట్టు సత్తా చాటాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. శనివారం కరీంనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి బాలుర హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. క్రీడాకారులు లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని సూచించారు. తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో హ్యాండ్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటే క్రీడాకారులను జాతీయస్థాయిలో పాల్గొని తెలంగాణ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నామన్నారు. కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసవని లక్ష్మణ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మూడు రోజులపాటు రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలను నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీ ల్లో 10 ఉమ్మడి జిల్లాల నుంచి 200మంది క్రీ డాకారులు, 50 మంది అధికారులు పాల్గొంటున్నారని అన్నారు. వీరందరికీ మూడు రోజుల పాటు ఉచిత వసతి సౌకర్యాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, డీవైఎస్ఓ శ్రీనివాస్‌గౌడ్, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ పరిశీలకులు దీపక్ ప్రసాద్, జుంజుపల్లి వివేక్, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆనంద్ కుమార్, నెమలికొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్, జిల్లా సంఘ కోశాధికారి కనకయ్య, రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘ రెప్రిస్ బోర్డు కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

● అనుమానాస్పదుడిగా భావించి దాడి చేసిన స్థానికులు



రాజేందర్(ఫైల్)

వేములవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద వ్యక్తిగా భావించి స్థానికులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డ ఓ యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ నెల 15వ తేదీ బుధవారం తెల్లవారుజామున వేములవాడ పట్టణంలో చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా జెండా వెంకటాపురం గ్రామానికి చెందిన ఎసుకూరి రాజేందర్ (27) అనే యువకుడు ఈనెల 15వ తేదీ తెల్లవారుజామున తన స్నేహితులతో కలిసి రాజరాజేశ్వర స్వామి దర్శనం కోసం బైక్‌పై వస్తూ దారితప్పి భగవంతరావునగర్‌లోని తాటికొండ రాజయ్య ఫంక్షన్ హాల్ వైపునకు వెళ్లారు. ఆ సమయంలో అక్కడే ఉన్న కొందరు యువకులు వారిని అడ్డగించి ఎవరంటూ ప్రశ్నించారు. సమాధానం చెప్పేందుకు తడబడడంతో దొంగలుగా భావించిన స్థానికులు చితకబాదారు. తాము ఫలానా చోట పనిచేస్తున్నామని చెప్పిన వినకుండా విచక్షణారహితంగా చితక బాదారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన రాజేందర్‌తోపాటు మరొకరిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. నాలుగు రోజులుగా వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజేందర్ శనివారం మృతి చెందినట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. పదేళ్ల కింద తల్లిదండ్రులను కోల్పోయిన రాజేందర్ పనులు సరిగా లేకపోవడంతో జీవనోపాధి కోసం మామిడి తోటలో పనిచేసేందుకు 15 రోజుల క్రితమే వేములవాడకు వచ్చాడని తెలుస్తోంది. ఇదిలా ఉండగా అనుమానాస్పద వ్యక్తులుగా భావిస్తూ స్థానిక యువకులు కొందరు విచక్షణారహితంగా దాడికి దిగి ఒకరి మృతికి కారణమైన ఘటనను పోలీసు శాఖ తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ దాడిలో పాలుపంచుకున్న యువకుల వివరాల కోసం సీసీ ఫుటేజీని పరిశీలించామని, నిందితులను గుర్తించామని, వారిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టామని పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సంచలనాలకు చిరునామా బడే చొక్కారావు



బడే చొక్కారావు అలియాస్ దామోదర్(ఫైల్)

మంథని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో తూర్పు అడవుల్లో విప్లవోద్యమాన్ని ఉరకలెత్తించినమావోయిస్టు రాష్ట్ర పార్టీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ మల్లన్న మూడు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృత్యువాత పడ్డారు. ఎన్‌కౌంటర్‌లో దామోదర్ మృతి చెందినట్లు మావోయిస్టు పార్టీ అధికారికంగా శనివారం ప్రకటన విడుదల చేఇంది. మంథని నియోజకవర్గ సరిహద్దుకు సమీపంలో ఉన్న ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ యువకుడిగా ఉన్నప్పుడే మావోయిస్టుల్లో చేరారు. తొలుత ఏటూరు నాగారం దళంలో సభ్యుడిగా పని చేసిన చొక్కారావు మహదేవపూర్-ఏటూరు నాగారం ఎల్‌జీఎస్ కమాండ్‌గా నియమితుల య్యారు. ఈక్రమంలోనే మహదేవపూర్ పోలీసుస్టేషన్‌ను బస్సు బాంబ్‌తో పేల్చి వేసిన ఘటనలో కీలక పాత్ర పోషించారు. కాటారంలో ఫారెస్టు గెస్టుహౌజ్, ఎంపీడీవో ఆఫీసులను పేల్చివేయడం, పోలీసు ఇన్‌ఫార్మర్ల పేరుతో అనేక మంది పై దాడులు, కొందరిని చంపిన సంఘటనలు, పలు ఎన్‌కౌంటర్లలో త్రుటిలో తప్పించుకున్నారు. ఉమ్మడి జిల్లాలోనితూర్పు డివిజన్‌కమిటీ కార్యదర్శిగా, ఖమ్మం-కరీంనగర్-వరంగల్ (కేకేడబ్ల్యూ పీ) కమిటీ కార్యదర్శిగా, జయశంకర్ భూపాలపల్లి-ములుగు-వరంగల్-పెద్దపల్లి (జేఎండబ్ల్యూపీ) కమిటీ అధికార ప్రతినిధిగా పనిచేశారు. మావోయిస్టు పార్టీ రాష్ట కమిటీ గా గత ఏడాది జనవరి నెలలోనే బడే చొక్కారావును పార్టీ కేంద్ర కమిటీ నియమించింది. ఈ క్రమంలో ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో ఆయన మృతి చెందారు. దీంతో దామోదర్ 30 ఏళ్ల విప్లవోద్యమ జీవితం ముగిసింది.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ



కాపర్‌వైరు చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

గంగాధర, జనవరి 18 (ఆంధ్రజ్యో తి): గంగాధర మండలం ఉప్పరమల్యాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరమల్యాలో వ్యవసాయ సాగు పంపు మోటర్ల కోసం ఎస్ఎస్ 15 నంబరు గల 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌కు నాలుగు బావుల మోటర్లు నడుస్తుంటాయి. కాగా శుక్ర వారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందపడేసి అందులోని కాపర్ వైరును ఎత్తుకెళ్లారు. ఉదయం పొలానికి నీరు పెట్టడానికి వచ్చిన రైతులు మోటర్ ఆన్ చేయగా కరెంటు సరఫరా లేదు. ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు కొట్టేసి ఉంటుందనే అనుమానంతో అక్కడికి వెళ్లి చూశారు. ట్రాన్స్‌ఫార్మర్ కిందపడేసి ఉండడంతో విషయాన్ని ఏఈ రాంమోహన్‌కు తెలియజేశారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తు న్నామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం

● చికిత్సపొందుతూ యువకుడి మృతి

ముత్తారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతారం గ్రామానికి చెందిన బండ రామకృష్ణ (32) అనే యువకుడు ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్సపొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బండ రామకృష్ణ అనే యువకుడు పెయింటింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పనిలో డబ్బులు రాకపోవడంతో అప్పులపాలయ్యాడు. దీంతో ప్రతిరోజు ఇంట్లో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తొమ్మిదో తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన భార్య మానస, కుటుంబసభ్యులు మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది.. పుష్య మాసం సందర్భంగా క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరిలో భక్తులు స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ పూజలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్ కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల పూజలు

మల్యాల, జనవరి 18(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. జగిత్యాల ఆర్డీవో మధుసూధన్ కుటుంబసమేతంగా అంజన్నను దర్శించుకున్నారు

● కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్టు ఆద్వర్యంలో కొండగట్టు అంజన్న సన్నిధికి వచ్చె భక్తుల సౌకర్యార్థం ఆరు సిమెంట్ బెంచీలను అందజేశారు. ట్రస్టు నిర్వహకులు గంగిశెట్టి జగదీశ్వర్ పాల్గన్నారు.



కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులు



మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ఎ వజీర్

ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

గణేశ్‌నగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ 1535 సెంట్రల్ అధ్యక్షుడు వజీర్ అన్నారు. శనివారం యూనియన్ కరీంనగర్ రీజియన్ మొదటి జనరల్ బాడీ సమావేశం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో నిర్వహించారు. కొత్తగా యూనియన్‌లోకి వచ్చిన కార్మికులను ఆయన ఆహ్వానించారు. ఈసందర్భంగా వజీర్ మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని, ఈపీఎఫ్ టు జీపీఎఫ్ అమలు చేయాలని అన్నారు. కార్యక్రమంలో రీజినల్ సెక్రెటరీ జమీరుద్దీన్ సిద్ధికి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, కోశాధికారి నాగేశ్వరరావు, శ్రీనివాస్ రెడ్డి, నగేష్, శ్రీనివాస్, మూర్తి, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

వేస్ట్ టు వెల్త్ కింద అగరు బత్తుల తయారీ

- కరీంనగర్ జైలులో 'మై నేషన్' బ్రాండ్‌తో ఉత్పత్తి
- ఆలయాల్లో పూజకు వాడిన పూల వినియోగం
- త్వరలో పూర్తిస్థాయి ఉత్పత్తి



మై నేషన్ అగరబత్తుల పాకెట్‌ను కలెక్టర్ పమేలా సత్పతికి అందిస్తున్న జైళ్లశాఖ డీజీ సౌమ్యమిశ్రా



కరీంనగర్ క్రైం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జైలులో అగరు బత్తీల తయారీని జైళ్ల శాఖ ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. ఆలయాల్లో వాడిన పూలతో జైలులోని ఖైదీలతో ఈ అగరు బత్తీల తయారీని చేపట్టింది. ఈ జైలులో ఇప్పటికే ఫర్నిచర్ ఇండస్ట్రీ, ఫినాయిల్, మాస్కుల తయారీలతోపాటు నర్సరీ, మే నేషన్ పేరిట కరీంనగర్‌లో రెండు పెట్రోల్ బంక్‌లను నిర్వహిస్తున్నారు. జిల్లా జైలులో 300కు పైగా ఖైదీలు ఉన్నారు. వారికి జైలులో వివిధ వృత్తుల్లో శిక్షణ ఇస్తూ విడుదల అయిన తరువాత వారు సొంత కాళ్లపై నిలబడి ఉపాధి పొందేందుకు మార్గం చూపుతున్నారు. కొందరు ఖైదీలు జైలులోనే స్టీల్ ఫర్నీచర్ ఇండస్ట్రీ, నర్సరీ, మాస్కుల తయారీ, ఫినాయిల్ తయారీతో ఉపాధి పొందుతున్నారు. తాజాగా అగరు బత్తీల తయారీని చేపట్టారు. అగరు బత్తీల తయారీకి ప్రధానంగా ముడి సరుకు పూలు.. ఈ పూలను దేవాలయాల నుంచి సేకరించాలని జైళ్ల శాఖ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా జైలులో అగరు బత్తీల తయారీకి అవసరమైన పూలను వేములవాడ, స్థానిక ఆలయాలు, పూల వ్యాపారుల నుంచి సేకరించాలని నిర్ణయించారు. ఈ మేరకు వేములవాడ ఆలయం, స్థానికంగా ఉన్న వివిధ ఆలయాలతోపాటు పూలవ్యాపారులతో చర్చించారు.



● తయారీ ఇలా..

ఆలయాల్లో ఉపయోగించిన పూలు, భక్తులు సమర్పించే పూల దండలు, వ్యాపారుల వద్ద వాడిపోయిన పూలను జైలు సిబ్బంది నిత్యం సేకరిస్తారు. ఆ పూలను శుభ్రపరచి వారం రోజులపాటు ఆరబెడతారు. ఎండిన పూలను పొడిగా మార్చి అగరు బత్తీలుగా తయారు చేస్తారు. మార్కెట్‌లో లభించే అగరు బత్తీలు బొగ్గు, ఇతర రసాయాలతో తయారు చేస్తుంటారు. జైలులో తయారు చేసే అగరుబత్తీలు సహజసిద్ధంగా పూలతో తయారు చేస్తుండడం, ఎలాంటి రసాయనాలు ఉపయోగించరు. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఉంటుందని జైలు అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో దేవుడికి ఉపయోగించి తొలగించిన పూలతో టీటీడీ అగరు బత్తీల తయారీని చేపట్టింది. ఇదే స్ఫూర్తిగా తీసుకుని జైళ్లశాఖ కరీంనగర్ జిల్లా జైలులో మొట్టమొదటిసారిగా అగరుబత్తీల తయారీకి శ్రీకారం చుట్టింది.

● 'మై నేషన్' అగరు బత్తుల విడుదుల

మై నేషన్ బ్రాండ్ పేరుతో ఎన్విరాన్‌మెంటల్ ఫ్రెండ్లీ ఫ్లవర్ ఇన్‌సెన్స్ స్టిక్స్‌ను జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి శనివారం విడుదల చేశారు. కరీంనగర్ జిల్లా జైలులో జరిగిన ఒక కార్యక్రమంలో మై నేషన్ అగరుబత్తీల ప్యాకెట్లను మార్కెట్‌లోకి విడుదల చేస్తూ మొదట అధికారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తయారీ విధానాన్ని డీజీ పరిశీలించారు. అనంతరం జైలులో ఖైదీలకు అందిస్తున్న వసతులు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐజీ మురళిబాబు, డీఐజీ ఎం సంపత్, జైలు సూపరింటెండెంట్ కె శ్రీనివాస్, వైద్య అధికారి కె వేణుగోపాల్, జైలర్లు పి శ్రీనివాస్, బి రమేష్, యు పరుశరాం, డిప్యూటీ జైలర్లు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ సుధాకర్‌రెడ్డి, ఎల్ రమేష్, ఎస్ అజయ్‌చారి, ఎన్ సంగీత, సిబ్బంది పాల్గొన్నారు.



అగరు బత్తీలను పరిశీలిస్తున్న జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా

ఇంటర్నెట్ సేవలు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి



టీవీ ఫైబర్‌ను పరిశీలిస్తున్న ఎండీ వేణుప్రసాద్

ముత్తారం, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిముత్తారంలో నాణ్యమైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని టీ ఫైబర్ సంస్థ ఎండీ వేణుప్రసాద్ అధికారులను ఆదేశించారు. గత నెల ఇంటింటికి ఇంటర్నెట్ పైలెట్ ప్రాజెక్టు కింద అడవి శ్రీరాంపూర్ గ్రామాన్ని ఎంపిక చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్‌బాబు ఆదేశానుసారం శనివారం అడవి శ్రీరాంపూర్ గ్రామాన్ని టీఫైబర్ ఎండీ వేణుప్రసాద్ సందర్శించారు. ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఎలా జరుగుతుంది.. నాణ్యతలో ఏమైనా లోపాలు ఉన్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వేణుప్రసాద్ గ్రామంలో అంతరాయం లేకుండా నాణ్యమైన ఇంటర్నెట్ మరియు టీవీ సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజి, అధికారులు ప్రణవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలోకి ఒరిగిన లారీ

మంథని, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఫెర్టిలైజర్స్ భారీ లోడుతో ఉన్న లారీ స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో ప్రధాన రహదారిలో ఉన్న డ్రైనేజీలో శనివారం దిగబడింది. షాప్ వద్ద అన్‌లోడ్ చేయటానికి వెళ్తున్న క్రమంలో రోడ్డు కింది భాగంలో ఉన్న డ్రైనేజీ పైకప్పు అధిక బరువు కారణంగా పగిలిపోయి వెనుక భాగం టైర్లు అందులో దిగబడిపోయాయి. దీంతో ఒక్కసారిగా లారీ ఎడమవైపు పూర్తిగా వంగిపోయింది. పక్కన రోడ్డుపై ఉన్న పూలబండిలపై ఒరిగింది. కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈసమయంలో అక్కడే ఉన్న పూల షాపుల నిర్వాహకులు, ప్రజలు, వాహనదారులకు ప్రమాదం తప్పింది. పోలీసులు వచ్చి లారీని, ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు.

అటవీ భూములను సంరక్షించాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 18 (ఆంధ్ర జ్యోతి) : మండలంలో సర్వే చేపట్టి అటవీ, ప్రభుత్వ భూములను సంరక్షించాలని గ్రా మాల్లోని ప్రజలు డిమాండ్ చేశారు. శనివారం మెట్‌పల్లి ఫారెస్ట్ అధికారులు షౌకత్ అలీ, అరుణ్ కుమార్, చైతన్యశీలకు మాజీ ఎంపీపీ పాలెపు నీలమ్మ అధ్వర్యంలో ఆత్మ కూర్, ఆత్మనగర్ గ్రామాల్లోని ప్రజలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల చుట్టూ ఉన్న వంద ల ఎకరాల్లో ఉన్న అటవీ భూములను కొందరు అక్రమదారులు చెట్లను తొలగించి చదును చేసుకుంటూ కబ్జా లకు పాల్పడుతు న్నారన్నారు. అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా సంరక్షించి మొక్కలు నాటాలన్నా రు. త్వరలోనే గ్రామాల్లో పర్యటించి భూము లను సంరక్షించాలని అధికారులను కోరామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామాల్లోని నాయకులు చౌటుపల్లి అంజయ్య, నేరెళ్ల శ్రీధర్, కేసీరెడ్డి నవీన్‌రెడ్డి, శ్రీనివాస్, రాజారెడ్డి, పాల్గొన్నారు.

కల్వర్టుపై నీటి ప్రవాహం

» గుంతలు పడి ప్రమాదకరంగా మారిన వంతెన



కల్వర్టుపై నుంచి పారుతున్న నీటిలో నుంచి వెళుతున్న వాహనదారులు

కోనరావుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో లో లెవెల్ వంతెన నిత్యం నీరు పారుతుండడంతో వరద తాకిడికి గుంతలు ఏర్పడి కల్వర్టు ప్రమాదకరంగా మారింది. సిరిసిల్ల నుంచి కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిలో కొన్నేళ్ల క్రితం నిర్మించినలో లెవెల్ వంతెనపై మల్కాపేట రిజర్వాయర్ నీరు నిత్యం ప్రవహిస్తోంది. వర్షాకాలంలోనూ వరద ఉధృతి ఎక్కువ. దీంతో లో లెవెల్ వంతెన కొట్టుకుపోయి గుంతలుగా మారింది. రోజు నీరు ప్రవహిస్తుండడంతో గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమా దాలకు గురవుతు న్నారు. అధికారులు పాలకులు స్పందించిలో లెవెల్ కల్వర్టుకు నిధులు మంజూరు చేయాలని, హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

అపస్మారక స్థితిలోకి డ్రైవర్

● ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



డ్రైవర్‌ను పరామర్శిస్తున్న డీఎం

మెట్‌పల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. టీజీ 02 యూబి 0228 నెంబర్ గల బస్సు మెట్‌పల్లి నుంచి రాయికల్ వెళ్తుండగా పాత బస్టాండ్ వద్ద డ్రైవర్ సతీష్ ప్రయాణికుల కోసం బస్సును ఆపాడు. ఉన్నట్టుంది ఒక్కసారిగా డ్రైవర్ అపస్మారక స్థితిలోకి వెళ్లి సీట్‌పై పడిపోయాడు. గమణించిన ప్రయాణికులు వెంటనే డ్రైవర్‌ను అంబులెన్స్‌లో ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. తినకపోవడం వల్ల నీరసం వచ్చి కళ్లు తిరిగి పడిపోయినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న డీఎం దేవరాజు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి డ్రైవర్‌ను పరామర్శించారు. ప్రస్తుతం డ్రైవర్ పరిస్థితి నిలకడగా ఉందని, మరో డ్రైవర్‌ను ఏర్పాటు చేసి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చారు.

వైభవంగా త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు



త్యాగరాజ స్వామి చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



పంచరత్న గానం వినిపిస్తున్న శ్రీవిద్య బృందం

వేములవాడ కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామిక్షేత్రంలో త్యాగరాజస్వామి 72వ ఆరాధనోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రాజన్న ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆరాధనోత్సవాలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు తెల్లవారు జామున ఉదయం 5.45 గంటలకు స్వస్తి పుణ్యాహవాచనము నిర్వహించారు. ఉదయం 7.25 గంటలకు త్యాగరాజస్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి నగర సంకీర్తన చేపట్టారు. ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ సూపరింటెండెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మహేష్ ఆధ్వర్యంలో త్యాగరాజస్వామి జీవిత చరిత్ర విశేషాలు వివరించారు. ఉదయం 10.30 గంటలకు శ్రీవిద్య బృందం పంచరత్న గానం, భాస్వంత్ శర్మ చేసిన సంగీత కచేరి అలరించాయి.



కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

వేములవాడ కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి వారి ఆరాద నోత్సవాల్లో భాగంగా కళాకారులు నిర్వహించిన కచేరీలు, కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శనివారం రాత్రి 8 గంటలకు భోగ ధర్మరాజు బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. కళాకారులను ఆలయ ఈవో వినోద్‌రెడ్డి సన్మానించారు.



న్యూస్ బాక్స్

చొప్పదండి ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కరీంనగర్‌లోని ఆయన నివాసంలో ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామానికి చెందిన రేవంత్‌రెడ్డి మిత్ర మండలి జిల్లా అధ్యక్షుడు విజయ్‌రెడ్డి ఆధ్వర్యంలోని నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. పలు సమస్యలను విన్నవించారు. పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని విజయ్‌రెడ్డి పేర్కొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కోనరావుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం వెంకట్రావుపేట ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు వెంకట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్టడీ మెటీరియల్ అందజేశారు. 32 మంది విద్యార్థులకు అందజేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశం అందజేశారు. ఎంఈవో మురళి నాయక్, ఫౌండేషన్ మేనేజర్లు ప్రతాప్, శంకర్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ఎల్లారెడ్డిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక నాయకులు శనివారం పంపిణీ చేశారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రవి, భాను, భూమయ్య పాల్గొన్నారు.

మందు బాబులకు జైలు శిక్ష

వేములవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి పట్టుబడిన పలువురు మందుబాబులకు వేములవాడ ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ జైలు శిక్ష విధించినట్లు పట్టణ సీఐ వీరప్రసాద్ శనివారం ప్రకటనలో తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన 75 మందిని శనివారం కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. ఏడుగురికి మూడు రోజుల జైలు శిక్ష, రూ.2500 జరిమానా, నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష, రూ.2500 జరిమానా, ఐదుగురికి ఒకరోజు జైలు శిక్ష, రూ.2500, 18 మందికి రూ.2500, 41 మందికి రూ.1500 జరిమానా విధించినట్లు వివరించారు.

కళలకు నిలయంగా తీర్చిదిద్దుతాం

- త్యాగరాజస్వామి జీవిత చరిత్రను భావితరాలకు అందించాలి
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆది శ్రీనివాస్


ఉత్సవాల్లో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న వేములవాడను కళలకు నిలయంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. దేవాదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో రాజన్న ఆలయంలో నిర్వహిస్తున్న త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలను ఈవో వినోద్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ త్యాగ రాజస్వామి ఆరాధనోత్సవాలను ఏడు దశాబ్దాలుగా నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంత వాసులకు ఎంతో గర్వకారణమని అన్నారు. కళాకారుల ప్రతిభ గుర్తింపునకు ఉత్సవాలు ఉపయోగపడుతాయన్నారు. రాజన్న ఆలయంలో 72 సంవత్సరాల క్రితం సాంబయ్య ఉత్సవాలను ప్రారంభించారన్నారు. ఉత్సవాలు, కళలను కాపాడుతూ భక్తిభావం పెంపొందించడానికి కృషి చేస్తామని, కీర్తనల ద్వారా ఆధ్యాత్మిక చింతన పెరుగుతుందని వివరించారు. సాంస్కృతిక కళాశాలను అప్ గ్రేడ్ చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సహకారంతో రాజన్న ఆలయంతోపాటు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్ కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష


పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులు

సిరిసిల్ల/వేములవాడ జనవరి 18 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరోతరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. శనివారం జిల్లాలో సిరిసిల్ల, వేములవాడలో ఐదు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 954 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా 740 మంది హాజరయ్యారు. 244 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హాజరు 77.5 శాతంగా నమోదైంది. పరీక్ష కేంద్రాలను డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి తనిఖీ చేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

ఇల్లంతకుంట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను బీటీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బెంద్రం తిరుపతిరెడ్డి శనివారం పరామర్శించారు. పొత్తూరు, రేపాక, సోమారంపేటలో ఇటీవల మృతిచెందిన కుటుంబాలను కలిశారు. నాయకులు కరుణాకర్, శేఖర్, అనీల్, రాంసాగర్, ఎల్లేష్ పాల్గొన్నారు.

క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తున్నాం


కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : క్రీడా రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నదని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ యువత క్రీడలపై దృష్టి సారించాలన్నారు. క్రీడలపై మానసిక ఉల్లాసం శారీరక దృఢత్వం లభిస్తుందన్నారు. కబడ్డీ, వాలీబాల్‌కు మన ప్రాంతం పెట్టింది పేరని, అదే ఒరవడిని యువత కొనసాగిస్తూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని అన్నారు. రానున్న ఒలంపిక్ పోటీల్లో పాల్గొనే విధంగా రాష్ట్రంలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, జిల్లా కబడి అసోసియేషన్ ప్రతినిధులు మల్లారెడ్డి, బొడ్డు రాములు, తిరుపతి, పట్టణ సీఐ వీరప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ మహేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా జిల్లా కబడ్డీ పోటీల సందర్భంగా ఏర్పాట్లు సరిగా చేయలేదంటూ పలువురు క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, క్రీడాకారులకు తగిన సమాచారం ఇవ్వకపోవడంతో సకాలంలో గవర్నమెంట్ కు చేరుకోవడానికి ఇబ్బంది పడ్డారని క్రీడాభిమానులు విమర్శించారు.

కందుల కొనుగోలుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు

సిరిసిల్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన కందుల కొనుగోలుకు ప్రణాళికబద్ధంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కందుల కొనుగోలుపై మార్కెటింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1129 ఎకరాల్లో కందుల సాగు అయ్యిందని, దీని ద్వారా 6211 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అన్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతులకు మద్దతు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ క్వింటాల్ కందులకు రూ.7550 మద్దతు ధర తప్పనిసరిగా అందించాలన్నారు. కందుల కొనుగోలు కేంద్రాలకు సింగిల్ విండోలు, డీసీఎంఎస్‌లలో అనువైన కేంద్రాలు గుర్తించాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి స్టోరేజీ పాయింట్‌కు తరలించేందుకు వీలుగా రవాణా ఏర్పాటు చేసుకోవాలన్నారు. గన్నీబ్యాగులు, సామగ్రి అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి హబీబ్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వసంతలక్ష్మి, మేనేజర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

'రేషన్' జాబితాపై అయోమయం

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో చేర్పులు, మార్పులకు సంబంధించిన దరఖాస్తులు 20,606 పెండింగ్‌లో ఉన్నాయి. రేషన్ కార్డుల్లో పిల్లల పేర్లు, కోడళ్ల పేర్లు చేర్చాలంటూ వేలాది మంది కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల్లో బోయినపల్లిలో 1321, చందుర్తి 1760, కోనరావుపేట 1403, ముస్తాబాద్ 1914, రుద్రంగి 948, సిరిసిల్ల 2689, తంగళ్లపల్లి 1333, వీర్నపల్లి 481, వేములవాడ రూరల్ 1105, వేములవాడ 2105, ఎల్లారెడ్డిపేటలో 2032 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో కొంత మంది మళ్లీ రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఉన్నారు. 2018 సంవత్సరానికి ముందు దరఖాస్తు చేసుకున్న వారిలో 2021 ఆగస్టులో 2271 మందికి రేషన్ కార్డులు అందించారు. ఆ తరువాత మళ్లీ రేషన్ కార్డుల ఆశలు ముందుకు వచ్చాయి.

సైబర్ నేరాలపై అవగాహనకు 'ఖాకీ కిడ్స్'

5వ పేజీ తరువాయి

తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు ఖాకీ కిడ్స్ కార్యక్రమన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులు మంచిని స్వీకరించాలని, చెడుకు దూరంగా ఉండాలని అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని అన్నారు. తల్లితండ్రులకు, గ్రామానికి గొప్ప పేరు తీసుకురావాలన్నారు. సంకల్పం, మనోబలం ఉంటే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చాన్నారు. విద్యార్థుల జీవితంలో పదోతరగతి పరీక్షలు మొదటి అడుగని, మార్చిలో నిర్వహించే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. రాజన్న ఆలయంలో ఇటీవల జరిగిన పాప అపహరణ కేసును ఛేదించి రాష్ట్ర స్థాయిలో జిల్లా పోలీస్ మంచి పేరు తెచ్చుకున్నట్లు చెప్పారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ పిల్లలు చెబితే తల్లిదండ్రులు, ప్రజలు తప్పక పాటిస్తారనే ఉద్దేశంతో ఖాకీ కిడ్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. జిల్లాలో ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఉన్న సైబర్ వారియర్లకు సైబర్ నేరాలకు జరిగే విధానం, ఎలా అరికట్టాలి, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. రానున్న మూడు నెలల్లో జిల్లాలో ఉన్న అన్ని కళాశాలలు, పాఠశాలల్లోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహి స్తామన్నా రు. అనంతరం గ్రామాలలోని ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాల న్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఉద్యోగ ప్రకటనలు, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐలు కృష్ణ, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, ఆర్ఐలు మధుకర్, రమేష్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆశాలకు రూ.18 వేల వేతనం నిర్ణయించాలి


లేఖ అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

సిరిసిల్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాలకు రూ.18 వేల వేతనాన్ని నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారి రజితకు ఈ నెల 21న పాదయాత్ర కార్యక్రమం ఉండడంతో విధులకు హాజరు కాలేమని ఆశావర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఆశావ ర్కర్లకు రూ.18 వేల వేతనంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పీఆర్సీ, వివిధ సర్వేల పారితోషికాలు, రూ. 10లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిం చాలని కోరారు. 21న జిల్లా కేంద్రంలోని కళాశాల మైదానం నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆశవర్కర్ల జిల్లా అధ్యక్షురాలు, మంజుల, భూలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట ఎంపీడీవోపై విచారణ

గంభీరావుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట ఎంపీడీవో రాజేందర్‌పై జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో ఎం.గీత శనివారం విచారణ చేపట్టారు. గంభీరావుపేట పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు దారుడు మంగళి చంద్రమౌళి సమక్షంలో విచారణ కొనసాగింది. ఎంపీడీవో, ఈవో విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అంబేద్కర్ జాతీయ సేవా రత్న అవార్డు గ్రహీత మంగళి చంద్రమౌళి ఇటీవల ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉప కార్యనిర్వహణ అధికారి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని విచారణ అనంతరం డిప్యూటీ సీఈవో గీత వెల్లడించారు. విచారణ సమయంలో ఈవోపీఆర్‌డీ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రవీణ్

తంగళ్లపల్లి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీని కాంగ్రెస్ నాయకులు శనివారం ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఇట్టిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మునిగేలా రాజు, మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల భరత్ గౌడ్, నాయకులు మందాటి తిరుపతి, పొన్నం లక్ష్మణ్ గౌడ్, మీరాల శ్రీను, శ్రీకాంత్, పవన్, శ్రీనివాస్, కంకణాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

రుద్రంగి, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. రుద్రంగి మండల కేంద్రంలోని ఫిట్‌నెస్ ఫ్రీక్ బ్యాడ్మింటన్ క్లబ్ గ్రౌండ్‌లో ఎర్రం గంగారాం - కాశమ్మ స్మారకర్థం మండల స్థాయి షెటిల్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. యువకులు, విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో గంగ నర్సయ్య, నంద్యాడపు వెంకటేష్, పిలమారపు ప్రవీణ్, అంబటి శంకర్, పులి రాజేష్, బాసని రాజు, స్వర్గం పరంధాములు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): లేబర్ అడ్డా మీద పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. శనివారం సిరిసిల్ల లేబర్ అడ్డా వద్ద బిల్డింగ్, ఇతర నిర్మాణ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి సిరిసిల్లకు పనికోసం వచ్చిన కార్మికులతో సిరిసిల్ల లేబర్ అడ్డా మీద పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి దొరకడం లేదన్నారు. స్థానిక కార్మికులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. లేబర్ కార్డులు లేని కార్మికులందరికీ ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి కార్డులు అందివ్వాలన్నారు. కార్మికులకు కనీస వసతులు కల్పించాలని కోరారు. కార్మికుల సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడానికి ఈ నెల 20న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, సహాయ కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, యూనియన్ అధ్యక్షుడు కోల శ్రీనివాస్, సందుపట్ల పోచమల్లు, నవీన్, రమేష్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్లారెడ్డిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తనను పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపిస్తే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ నియోజక వర్గాల ఎమ్మెల్సీ ట్రస్మా బలపర్చిన అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. శేఖర్‌రావు హాజరై మాట్లాడుతూ ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తే విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి పాటు పడుతానన్నారు. ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు లతీఫ్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : పట్టభద్రుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు, తాళ్ళపెల్లి, ఇల్లంతకుంట, వల్లంపట్ల గ్రామాలలోని పాఠశాలలో శనివారం ప్రచారం నిర్వహించారు. ట్రస్మా మండల అధ్యక్షుడు తూముకుంట శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి


సిరిసిల్లలో నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

సిరిసిల్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శనివారం సిరిసిల్లలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిరిసిల్ల ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ పేదల కోసం చేసిన సేవలు కొనియాడారు. ప్రభుత్వం నుంచి అందించిన సక్షేమ పథకాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి ఆవునూరి దయాకర్‌రావు, అడ్‌హక్ కమిటీ సభ్యులు తీగల శేఖర్‌గౌడ్, నక్క రాజయ్య, గుజ్జె శివరాం, బింగి వెంకటేశం, జక్కని అరవింద్, బాలరాజు, ప్రశాంత్, సంతోష్, కోమురయ్య, రాజేష్, నరేందర్, అశోక్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలంలో ఎన్టీఆర్ చిత్ర పటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక ఆసుపత్రిల్లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా ఇన్‌చార్జి దయాకర్‌రావు, నాయకులు నారాగౌడ్, సూర్యానాయక్, శేఖర్‌గౌడ్, బాల్‌రాజు, రంగారావు, దాసు, చంద్రారెడ్డి, మల్లారెడ్డి, రాములునాయక్, లక్ష్మీరాజం, ప్రభాకర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ: వేములవాడలో టీడీపీ సీనియర్ నాయకుడు రామస్వామి నేతృత్వంలో పలువురు నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల సంక్షేమం దృష్టిలో ఉంచుకొని రూపాయికి కిలో బియ్యం వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన గొప్ప నాయకుడు నందమూరి తారక రామారావు అని కొనియాడారు.

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు వెంకటి, కార్యకర్తలు పాల్గొన్నారు.


వేములవాడలో నివాళులర్పిస్తున్న నాయకులు


ఎల్లారెడ్డిపేటలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

తోటివారికి సహకారం అందించాలి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్

సిరిసిల్ల, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మనుషులు తమ తోటి మనుషులకు సహకారం అందించాలని మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో జీవనం సాగిస్తూ సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని మున్సిపల్ చైర్‌పర్సన్‌జిందం కళాచక్రపాణి అన్నారు. శనివారం సిరిసిల్లలో దారుల్ ఖైర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అకుల కృష్ణ, సొసైటీ ప్రతినిధులు ఇన్‌కేసర్ బాబా, రఫీ, అన్సార్ అలీ, సలీంపాషా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి అధిక నిధులు


భూమి పూజ చేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం

ఎల్లారెడ్డిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తోందని ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో రూ.20 లక్షల ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ రాష్ట్ర నేత సంగీతం శ్రీనివాస్, స్థానిక నాయకులతో కలిసి శనివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సబేరాబేగం మాట్లాడుతూ పల్లెలను అన్ని రంగాల్లో ముందుంచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని సర్కారు కృషి చేస్తోందన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నాణ్యతతో కూడిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, దేవరాజు, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, శంకర్, గౌస్, సాహెబ్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, రవి, సురేందర్, రమణారెడ్డి, సురేందర్‌రెడ్డి, బాపురెడ్డి, శ్రీనివాస్, భాస్కర్‌పాల్గొన్నారు.

నేడు మల్లికార్జునస్వామి జాతర

కథలాపూర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాండ్ర్యాలలో ఈ నెల 19న మల్లికార్జునస్వామి జాతరోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి భక్తులు కొండపైకి వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. స్వామివారి కళ్యాణం పండితులు నిర్వహిస్తారని భక్తులు వీక్షించి తరించాలని కోరారు. మహిళలు స్వామివారికి బోనాలు సమర్పించుకుంటారని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా నిలుస్తాం

ఎల్లారెడ్డిపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి): వారం రోజుల కిందట గుండె పోటుతో మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ పులి రాజు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని, అండగా నిలుస్తామని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి భరోసా కల్పించారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన రాజు కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. నాయకులు చక్రధర్‌రెడ్డి, పర్శరాములు, లక్ష్మారెడ్డి, నర్సయ్య, మల్లారెడ్డి, గౌస్, బాబు, రాంరెడ్డి, రామచంద్రం, లక్ష్మణ్, వెంకటేశ్, రవి, రాజయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

గంభీరావుపేట, జనవరి 18 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలోని బరిగేలా గూడెం కాలనీలో ఇటీవల అనారోగ్యం మృతి చెందిన గ్యార పద్మ కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ రాష్ట కార్యదర్శి అవునూరి ప్రభాకర్ శనివారం పరామర్శించారు. మూగ చెవిటి, గుండె సమస్యతో బాధపడుతున్న పద్మ కొడుకులను ఓదార్చారు. అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. జిల్లా కన్వీనర్ భిక్షపతి, జిల్లా అధ్యక్షుడు కమపూర్ అక్షణ్, కో కన్వీనర్ సావనపల్లి రాకేష్, జిల్లా నాయకుడు ఇరిగి భాను, మండల కన్వీనర్ బరుకుటం తిరుపతి, కొకన్వీనర్ ఇరిగి సందీప్ నాయకులు తిరుపతి నర్సయ్య మహేందర్ తదితరులు ఉన్నారు.